క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ



ఉప్పునుంతల: మండలంలోని తాడూరులో మంగళవారం భగత్‌సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ లెనిన్ మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూత్ కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ శేఖర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్‌సింగ్, యువజన సంఘం నాయకులు ప్రహ్లాద్, రాంచరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కల్వకుర్తిరూరల్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత ఎంపీడీఓ వెంకటరాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని మైదానంలో శివాజీ సేవా కమిటీ ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువకులు, స్వయం సేవకులు మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో శివశంకర్‌జీ, శివాజీసేవా సమితి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, కిశోర్, వివేకానంద, నరేష్‌గౌడ్, నర్సింహ, మల్లేష్, సందీప్, మహేష్, మహేశ్వర్‌రెడ్డి, చారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన లక్ష్మయ్య సొంత ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గ్రామస్తులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ఇంటి నిర్మాణ సామగ్రి ఇటుక, సిమెంట్, ఐరన్ అందజేశారు. కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ మిత్రమండలి సభ్యులు కిశోర్, మల్లేష్, లక్ష్మయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



తాడూరు: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ సాయిరమేష్‌కుమార్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని యంగంపల్లి, యాదిరెడ్డిపల్లి, ఐతోల్ గ్రామాల్లో ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతుల కొనుగోలు చేసిన విత్తనాలకు, ఎరువులకు సంబంధించి రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

అందుబాటులో పశుగ్రాస విత్తనాలు

కోడేరు: మండల కేంద్రంలోని పశు వైద్యశాలల్లో పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పశువైద్యాధికారి భానుకిరణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి మొత్తం రెండు క్వింటాళ్ల విత్తనాలు వచ్చినట్లు పేర్కొన్నారు. 75 శాతం రాయితీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు.

భక్తులకు మౌలిక వసతులు కల్పించాలి

అమ్రాబాద్: భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని ఆర్యవైశ్య మహాసభ చైర్మన్ జూలూరి సత్యనారాయణ కోరారు. ఈ నెల 17న తొలి ఏకాదశి సందర్భంగా అంతర్‌గంగకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై మంగళవారం అమ్రాబాద్ అమరేశ్వరాలయం వద్ద కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు అన్నాదానం, నీటి సౌకర్యం, టెంట్లు తదితర వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సంబువెంకటరమణ, గోపాల్, వెంకటయ్య, లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యాశాఖపై సమావేశం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డులోని టీకే ఫంక్షన్ హాలులో బుధవారం విద్యాశాఖపై సమావేశం నిర్వహించనున్నట్లు అచ్చంపేట ఇన్‌చార్జ్ ఎంఈఓ రామారావు మంగళవారం ఓ ప్రకటలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, డీఈఓ హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సమావేశం నిర్వహిస్తునట్లు తెలిపారు.

గ్యారంటీలపై గందరగోళం



మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్

- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

తాడూరు: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించింది. ఆయా గ్రామాల్లో ఆయా పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, జీరో ఉచిత విద్యుత్ బిల్లు అమలు చేస్తోంది. కాని మండలంలో జీరో బిల్లు రాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పథకాల అమలు కోసం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జనవరి 6వ తేదీ వరకు తీసుకున్న దరఖాస్తులను మాత్రమే ఆన్‌లైన్ చేశారు. కాని ఆరు గ్యారంటీ పథకాల కోసం విడివిడిగా ఆన్‌లైన్ నమోదు చేయలేదు. దీంతో జీరోబిల్లు అమలు కావడం లేదు. పలు గ్రామాల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు.



గ్రామపంచాయతీ కార్యాలయంలో..

మండలంలో ఇలా..

మండలంలోని 24 గ్రామ పంచాయతీలకుగాను ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 10,992 దరఖాస్తులు ఆరు గ్యారంటీలకు సంబంధించినవి దరఖాస్తులు అందాయి. ఇందులో 200 యూనిట్ల ఉచిత కరెంట్(గృహజ్యోతి), రూ.500 కు సబ్సిడీ సిలిండర్, మహిళలకు రూ.2500లకు మహాలక్ష్మి పథకం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఆయా గ్రామాల ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. కరెంట్ జీరో బిల్లుకు సంబంధించి 680 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు పథకాలకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు పేర్కొన్నారు. మొత్తం దాదాపు 70 శాతం వరకు పూర్తి అయ్యిందని తెలిపారు.

జీరో బిల్లు రావడం లేదు..



ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా జీరో బిల్లుకోసం దరఖాస్తులు చేసుకున్నాం. ఇందుకు సంబంధించి ఆధార్, రేషన్‌కార్డు, గ్యాస్ కనెక్షన్ నంబర్, ప్రజాపాలన దరఖాస్తు జిరాక్స్ కాపీలు తీసుకొని కార్యాలయానికి వచ్చాం. త్వరగా జీరో బిల్లు అమలు చేయాలి.

– చంద్రయ్య, తాడూరు

పథకాలు అమలు చేయాలి..



ఉచిత కరెంట్ బిల్లుతోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలు పర్యటించి పథకాలపై అవగాహన కల్పించాలి. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని అర్హులు ఇబ్బంది పడుతున్నారు.

– రాములు, ఇంద్రకల్

ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం..



ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులన్నింటిని పరిశీలించి అర్హులైనవారందరికి పథకాలు అమలు అవుతాయి. జీరో బిల్లు కోసం దరఖాస్తులు స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాం. ప్రతి దరఖాస్తు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం ఉంది.

– లక్ష్మణ్‌నాయక్, ఎంపీడీఓ తాడూరు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



మాట్లాడుతున్న చంద్రకళ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీ టీచర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ జీఓ నంబర్ 10ని రద్దు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో భాగంగా రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. నెలకు రూ.5వేలు పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, రామయ్య, అంగన్‌వాడీ టీచర్లు పార్వతమ్మ, సువర్చల, అండాలమ్మ, పద్మమ్మ, కృష్ణమ్మ, వెంకటమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక మోతాదులో ఎరువులు వాడొద్దు



అవగాహన కల్పిస్తున్న ఏఓ

లింగాల: సాగు చేసిన పంటలకు అధిక మోతాదులో ఎరువులను, క్రిమిసంహారక మందులను వినియోగించొద్దని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని కొత్తకుంటపల్లి శివారులో మంగళవారం వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఎరువుల వాడకంలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అవసరానికి మించి యూరియా వాడుతున్నట్లు గుర్తించారు. మొక్కజొన్న పంటకు ఒక ఎకరాకు 30 రోజుల దశలో ఒక బస్తా, 45 రోజులకు మరో బస్తా చొప్పున మందులను వాడాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

చారకొండ: మండలంలోని జేపల్లి నూతన పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరవుతున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్పొరేట్ కళాశాలలో ఫీజులు నియంత్రించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రైవేటు కళాశాలలో అధిక ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐఎస్‌ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు కార్పొరేట్ కళాశాలలో యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు మారేడు శివశంకర్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు మధు, నరేష్, ప్రకాష్, భూషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కల్వకుర్తిరూరల్: మండలంలోని ముకురాల పాఠశాలలో బదిలీ వెళ్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని రెండు పాఠశాలల హెచ్‌ఎంలు రామేశ్వర్, వెంకటయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పద్మ, దేవయ్య పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్



లింగాల: మండల కేంద్రంలో ఎస్‌ఐ జగన్‌మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్ లేని 20 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ కొత్త చట్టం అమలులోకి వచ్చిందని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు.

మంచాలకట్టలో వనమహోత్సవం



పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విజయ్‌గౌడ్, పంచాయతీ సెక్రెటరీ అశ్వినీలు ఆలయం ఎదుట, స్కూల్ ఆవరణ, పలు కాలనీలలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కల సంరక్షణగా అందరి బాధ్యత అన్నారు. మత్స్యశాఖ మండల అధ్యక్షుడు డబ్బ గోవిందు, రాముడు, శివమ్మ, లక్ష్మీదేవమ్మలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: బిజినేపల్లి మండలం నంది వడ్డెమాన్ పరిధిలోని ఆవులోనికుంట శిఖంకు సంబంధించిన సర్వే నంబర్ 381లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారని కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాసులు, వీరస్వామి, సుదర్శన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

పెంట్లవెల్లి: ఆశవర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడు బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశవర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వైద్య రంగానికి బడ్జెట్ పెంచకుండా, రాష్ట్రాలకు సరిపడా నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తోందని ఆరోపించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. శ్రమ దోపిడీకి పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, శివలీల, వరలక్ష్మి, మమత, బీమమ్మ, సునీత, పద్మలు పాల్గొన్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి

పాన్‌గల్: విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచే విధంగా బోధన సాగించాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, అమ్మ ఆదర్శ కమిటీ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం నాణ్యతగా అందించాలని సూచించారు.

తహసీల్దార్‌కు వినతి



పెద్దకొత్తపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, రైతులకు ఫసల్ బీమాయోజన పథకాలను అమలు చేయాలని కోరుతూ మంగళవారం మండల కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ ఈసూప్‌అలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు కోట్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బీమేష్, ప్రధాన కార్యదర్శి తిరుమల్, శ్రీనివాసారావు, మార్కండేయ, బాలకృష్ణ, లింగస్వామి పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ఉప్పునుంతల: అదనపు కట్నం వేధింపులపై మంగళవారం మండల కేంద్రంలో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని గువ్వలోనిపల్లికి చెందిన కొండపల్లి శివజ్యోతికి ఆరేళ్ల కిందట నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన రాజేష్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.8 లక్షలు నగదు, 5 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. అదనపు కట్నం కోసం మార్చి 3న భర్తతో పాటు మామ చంద్రయ్య, అత్త అంజమ్మలు వేధించి దాడి చేసి ఇంటి నుంచి పంపించారని బాధితురాలు శివజ్యోతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమస్యల సాధనకు రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న ప్రశాంత్

కల్వకుర్తిరూరల్: విద్యార్థుల సమస్యల పరిష్కారం ఏబీవీపీతోనే సాధ్యమని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్ అన్నాడు. ఆ సంఘం 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఏబీవీపీ జెండాను ఎగురవేశారు. భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయవాద భావాజాలం వ్యాప్తి, దేశ భక్తి పెంపొందించేందుకు 1949 జూలై 9న ఏబీవీపీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలను తొలగించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వంశీ, హరీష్, చందు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

అచ్చంపేట రూరల్: బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని డీటీడీఓ కమలాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఎద్దకొత్తపల్లి మండలం కొత్త యాపట్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింహులు తన 11 ఏళ్ల కుమారుడిని అదే గ్రామంలో పాండు అనే వ్యక్తి వద్ద పనిలో పెట్టి బతుకుదెరువు కోసం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లారు. ఈ విషయాన్ని గ్రామస్తుల అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు డీటీడీఓ గ్రామానికి వెళ్లి బాలకార్మికుడిని గుర్తించి మంగళవారం అచ్చంపేట పట్టణంలోని ఆశ్రమ పాఠశాలలో 3వ తరగతిలో చేర్పించారు. విద్యార్థికి రెండు జతల స్కూల్ యూనిఫాం, స్పోర్ట్స్ యూనిఫాం, నోట్‌బుక్స్, టెస్టు బుక్స్ ఇతర వస్తువులను అందించారు. కార్యక్రమంలో ఏటీడీఓ యాదమ్మ, డిప్యూటీ డీఈఓ శంకర్, స్కూల్ హెచ్‌ఎం మల్లేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ



తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతల సహాయ సహకారంతో మంగళవారం రాగిజావ, విద్యా సామగ్రి అందజేశారు. మాజి సర్పంచ్ నిరంజన్, మాజీ ఎంపీటీసీ కరుణాకర్, మరికొంత మంది దాతల సహకారంతో రాగిజావతోపాటు, డిక్షనరీ, స్టేషనరీ సామగ్రి అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. విద్యాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని దాతలు పేర్కొన్నారు.

లంపీస్కిన్ నివారణకు టీకాలు



తెలకపల్లి: పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్య అధికారి నాగరాజుయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని తెలకపల్లి, కమ్మరెడ్డిపల్లి, బొప్పల్లి, వట్టిపల్లి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. తెల్ల జాతి పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కోడెలు, ఎద్దులకు, ఆవులకు, దూడలకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. తెలకపల్లిలో 81, కమ్మరెడ్డిపల్లిలో 60, బిప్పల్లిలో 50, వట్టిపల్లితండా గ్రామాల్లో 58 మొత్తం 249 పశువులకు టీకాలు వేసినట్లు అధికారి తెలిపారు.

కొలువుదీరిన పీర్లు



తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో మొహర్రం వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్ల చావిడీలను ప్రత్యేకంగా అలంకరించి పీర్లను ఏర్పాటు చేశారు. 10 రోజులపాటు గ్రామాల్లో పీర్ల ఊరేగింపు, వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ క్రైం: భర్తపై భార్య ఫిర్యాదు చేసిన ఘటనలో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన రేణుక, రవికుమార్‌లకు వివాహమైంది. కొన్నేళ్ల కిందట రవికుమార్ రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య రేణుకను భర్త తరుచుగా వేధించడంతో మంగళవారం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



లింగాలలోని గురుకులంలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ శాఖ బాలుర పాఠశాల, కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడు మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నిర్మాణం చేసిన మరుగుదొడ్లు నిర్వహణ సక్రమంగా లేక పోవడంతో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. గురుకులంలో 700 పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో 50 వరకు నిర్మించిన మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం నూతనంగా నిర్మించిన భవనంలో ఉన్న కొన్ని మరుగుదొడ్లను మాత్రమే వినియోగిస్తున్నారు. సరిపడ మరుగుదొడ్లు లేకపోవడంతో బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను బాగు చేయించి వాడుకలో తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిధులు మంజూరయ్యాయి

గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడు మరుగుదొడ్లు లేవు. కొత్త వాటిని నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 60 లక్షలు మంజూరు చేసింది. కాని టెండర్లు కాక పోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వాడుకలోకి తీసుకరావడానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. టెండర్లు అయిన వెంటనే కొత్త వాటి నిర్మాణం చేపడుతాం. లేని

– బాలస్వామి, ప్రిన్సిపాల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com